క్లుప్తంగా

ఘనంగా చర్చి ప్రారంభం


చర్చిని ప్రారంభిస్తున్న బిషప్ జ్వాన్నేస్

కోవెలకుంట్ల: మండలంలోని అమడాల గ్రామం లో రూ.30 లక్షలతో పునర్నించిన ఆర్సీఎం చర్చిని శనివారం కర్నూలుకు చెందిన బిషప్ గోరంట్ల జ్వాన్నేస్ ప్రారంభించారు. అనంతరం క్రైస్తవులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వివిధ చర్చిల పాస్టర్లు కరుణాకర్, జోసఫ్, లూర్దయ్య, సుధాకర్, గాబ్రియేల్, గ్రామ సంఘ పెద్దలు రాముడు, దేవసాయం, భగవాన్, ప్రసాద్ పాల్గొన్నారు.

సేవా సమితి నియోజకవర్గ అధ్యక్షుడి ఎంపిక


మహబూబ్‌బాషా

కొలిమిగుండ్ల: జనసంరక్షణ సేవా సమితి బనగానపల్లె నియోజకవర్గ అధ్యక్షుడిగా అంకిరెడ్డిపల్లెకు చెందిన సయ్యద్ మహబూబ్‌బాషాను ఎంపిక చేసినట్లు ఆ సంస్థ రాష్ట్రకార్యవర్గ సభ్యులు శనివారం తెలిపారు. కుల,మతాలకు అతీతంగా ప్రజలు, విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయాలని సూచించారు. తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎంపిక చేయడంపై మహబూబ్‌బాషా రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఏఐఎస్‌ఎఫ్ మండల కమిటీ ఎన్నిక

బనగానపల్లె రూరల్: విద్యారంగంలో ఉన్న సమస్యల పరిష్కారానికి ఏఐఎస్‌ఎఫ్ నిరంతర పోరాటం చేస్తుందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్, కార్యదర్శి ధనుంజయ్ అన్నారు. శనివారం స్థానిక బీసీ కళాశాల వసతి గృహంలో ఏఐఎస్‌ఎఫ్ మండల అధ్యక్షుడిగా మహేంద్ర, కార్యదర్శిగా ప్రశాంత్‌తో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే ఫీజురియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం వడ్డించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు సురేష్, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాలుట్ల రంగస్వామికి పూజలు


విశేష అలంకరణలో పాలుట్ల రంగస్వామి

బేతంచెర్ల: కార్తీక మాసం శనివారాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని గూటుపల్లె కొండలో వెలసిన పాలుట్ల రంగస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో అన్నాభిషేకం


అన్నాభిషేకంలో భక్తులు

డోన్ టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న సాంబశివాలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని శివలింగానికి ఆలయ ప్రధాన అర్చకుడు శేషావలిశర్మ ఆధ్వర్యంలో అన్నాభిషేకం చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా మీర్ ఫజల్ అలీఖాన్ జయంతి


నివాళులర్పిస్తున్న స్థానికులు

బనగానపల్లె: బనగానపల్లె చివరి నవాబు మీర్ ఫజల్ అలీఖాన్ 127వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నవాబు సర్కిల్ వద్ద ఆయన విగ్రహానికి ముస్లిం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పెంటర్ యూనియన్ కార్యదర్శి మహమ్మద్‌హుస్సేన్, సజ్జాద్‌హుస్సేన్, నాసర్‌హుస్సేన్, కార్పెంటర్ యూనియన్ అధ్యక్షుడు చాంద్‌బాషా, మహమ్మద్ హుస్సేన్, జమిందర్ తదితరులు పాల్గొన్నారు.

అంతా డిజిటల్ మయం

- పల్లెలకు చెరుకున్న యూపీఐ ఆన్‌లైన్ పేమెంట్లు
- చిల్లర సమస్యలకు చెక్
- నియోజకవర్గంలో 10 వేలకుపైగా దుకాణాలు


ఆకుమల్ల గ్రామంలోని చిల్లర దుకాణంలో ఏర్పాటు చేసిన క్యూఆర్‌కోడ్

సంజామల: గతంలో డిజిటల్ చెల్లింపులు అంటే చదువుకున్న వారు, షాపింగ్ మాల్స్, వ్యాపార సంస్థలకే పరిమితమై ఉండేవి. స్మార్ట్‌ఫోన్ల రాక, ఇంటర్నెట్ వినియోగం పెరగడంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఇప్పుడు ప్రతి పల్లె, ప్రతి దుకాణంలో డిజిటల్ చెల్లింపులు వచ్చేశాయి. టీ, బజ్జీ, పాలు, కూరగాయలు, పండ్లు, హోటల్, కిరాణ దుకాణం ఏదైనా క్యూఆర్ కోడ్‌తో స్కానింగ్ చేసి సులభంగా చెల్లింపులు చేస్తున్నారు. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, భారత్ పే తదితర క్యూఆర్ కోడ్ స్కానర్లు దుకాణంలో దర్శనమిస్తున్నాయి. చిల్లర సమస్యను అధిగమించడంలో డిజిటల్ పే కీలక పాత్ర పోషిస్తోంది.

డిజిటల్ వైపే మక్కువ

ఇప్పుడు గ్రామాలు, పట్టణాల్లో ఏ దుకాణమైనా క్యూఆర్ కోడ్‌స్కానర్ లేనిదే వ్యాపారాలు జరగని పరిస్థితి. కస్టమర్లు కూడా ఎక్కువ శాతం డిజిటల్ చెల్లింపులకు మొగ్గు చూపుతున్నారు. చిల్లర సమస్య నుంచి బయటపడడానికి టీ స్టాళ్లు, హోటళ్లు, బార్బర్ షాప్‌లు, డాబాలు, తోపుడు బండ్లు, పండ్లు, పూల వ్యాపారాలు చేసే వారంతా ఆన్‌లైన్ చెల్లింపులను ప్రోత్సహిస్తున్నారు. కస్టమర్ క్యూఆర్ కోడ్ ద్వారా నగదు చెల్లించిన వెంటనే స్పీకర్ ద్వారా ఎంతో అమౌంట్ చెల్లించారో వాయిస్ ద్వారా తెలుపుతుంది.

కోవిడ్‌తో భారీ మార్పులు

కోవిడ్ సమయంలో నగదు చెల్లింపులకు వ్యాపారులు బయపడేవారు. ఆ సయయంలో డిజిటల్ చెల్లింపులు చక్కటి పరిష్కారం చూపాయి. దేశంలో పెద్ద నోట్లు రద్దు సమయంలో ఆర్థిక లావాదేవీలను ప్రోత్సహించారు. అవి పెద్ద వ్యాపార సంస్థలకే పరిమితం అయ్యాయి. కానీ కొన్ని అపోహలతో గ్రామీన ప్రాంతాల్లో అమలుకు నోచుకోలేదు. కోవిడ్ అనంతరం నగదు రహిత లావాదేవీలు గణనీయంగా తగ్గి వ్యాపారులు అలవాటుపడ్డారు. పేమెంట్ యాప్‌ల ద్వారా లావాదేవీలు మరింత సులభతరం అయ్యాయి. పెట్రోల్ బంక్, ఫ్యాన్సీ, బుక్స్ స్టోర్స్, టీస్టాల్స్, కిరాణ దుకాణంలో ప్రతి చోట డిజిటల్ చెల్లింపులు జరుగుతున్నాయి.

నియోజకవర్గంలో 50 శాతం డిజిటల్ చెల్లింపులే

బనగానపల్లె నియోజకవర్గంలో 10 వేలకుపైగా దుకాణాలు ఉన్నాయి. ప్రతి దుకాణంలో ఆన్‌లైన్ పేమెంట్ యాప్ ద్వారా క్యూఆర్ కోడ్‌లతో కస్టమర్లు చెల్లింపులు చేస్తున్నారు. గ్రామానికి వచ్చి దుకాణాల యజమానులతో ఒప్పందం చేసుకుని థర్డ్ పార్టీ నిర్వహకులు క్యూఆర్ కోడ్‌లు, స్పీకర్లను అమర్చి ఇసుస్తున్నారు. ప్రతి రోజు జరిగే వ్యాపారంలో 50 శాతం డిజిటల్ చెల్లింపులే ఉంటున్నాయి.

స్పీకర్‌తో మోసాలను అరికట్టవచ్చు

డిజిటల్ చెల్లింపుల్లో లాభాలతో పాటు మోసాలు కూడా జరుగుతున్నాయి. కానీ స్పీకర్ ఉండడంతో పేమెంట్ జరిగిన వెంటనే వాయిస్ మోసేజ్ వస్తుంది. అలా మనం చెల్లింపులను నిర్ధారించుకోవచ్చు. స్పీకర్ లేకుంటే అమౌంట్ పంపాము అని పాతవి చూపించి మోసం చేసే అవకాశాలు ఉంటాయి. డిజిటల్ చెల్లింపుల విషయంలో కొంచెం జాగ్రత వహిస్తే మంచిది.

–మౌలాలి, కిరాణ దుకాణం, ఆకుమల్ల

చిల్లర సమస్యలు లేవు

గతంలో దుకాణానికి వచ్చే ప్రతి ఒక్కరికీ చిల్లర సమస్యతో చాలా ఇబ్బందిగా ఉండేది. ఎప్పుడైతే డిజిటల్ సేవలు అందుబాటులోకి వచ్చాయో అప్పటి నుంచి చిల్లర సమస్యలు లేవు. డిజిటల్ చెల్లింపులతో వ్యాపారం కూడా సజావుగా సాగుతోంది.

–యూనస్, టీస్టాల్, ఆకుమల్ల

నాడు కళకళ.. నేడు వెలవెల


ఆర్‌ఎస్ రంగాపురంలో శిథిలావస్థలో ఉన్న పద్మాలయ టాకీస్

బేతంచెర్ల: ఒకప్పుడు సినిమా థియేటర్లు ప్రతి రోజు నాలుగు షోలతో కళకళలాడేవి. ఎంత దూరమైనా సరే గ్రామీణ ప్రాంత వాసులు పట్టణానికి చేరుకుని తమ అభిమాన నటుల సినిమాలను చూసి ఆనందపడేవారు. సినిమా విడుదల రోజున పూలదండలు, కటౌట్లను ఏర్పాటు చేసేవారు. కాలక్రమేణా పరిస్థితులు మారిపోయాయి. స్మార్ట్ ఫోన్‌ల వినియోగం, ఓటీటీ యాప్‌లు, పైరసీ, సోషల్ మీడియా ప్రభావంతో థియేటర్లకు ప్రేక్షకుల ఆధారణ కొరవడింది. గతంలో బేతంచెర్లలో 4, సిమెంట్‌నగర్, ఆర్‌ఎస్ రంగాపురంలో ఒక్కోటి చొప్పున మొత్తం 6 థియేటర్లు ఉండేవి. బేతంచెర్లలో 1950లోనే నిలకంఠేశ్వర టూరింగ్ టాకీస్ ఉండేదని పట్టణ వాసులు పేర్కొంటున్నారు. పట్టణంలో 1970లో వెంకటేశ్వర థియేటర్, 2004 మినీ వెంకటేశ్వర, 1982లో పరమేశ్వర టాకీస్, 1990లో అనురాధ థియేటర్, సిమెంట్ నగర్‌లో టెంట్, ఆర్‌ఎస్ రంగాపురంలో పద్మాలయ టూరింగ్ టాకీస్‌లు ఉండేవి. ప్రస్తుతం శ్రీవెంకటేశ్వర, మినీ వెంకటేశ్వర థియేటర్లు మాత్రమే ఉన్నాయి. నాడు ఒక వెలుగు వెలిగిన థియేటర్లు నేడు గోడౌన్‌లుగా దర్శనమిస్తున్నాయి. మరికొన్ని శిథిలావస్థలో ఉన్నాయి.

గుండంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

కొలిమిగుండ్ల: కోర్నపల్లె సమీపంలోని గుండం ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసం రెండో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే పుట్టలో కొలువైన స్వామిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆకుపూజ, అభిషేకం నిర్వహించారు. జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాలను ఏర్పాటు చేశారు. చుట్టు పక్కల గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని వనభోజనాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, నాగిశెట్టిపల్లె సర్పంచ్ ఈశ్వరయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రామసుబ్బయ్య, మబ్బు శివ రామసుబ్బారెడ్డి, నీలం సంజీవకుమార్‌రెడ్డి, కామిని తిమ్మారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

● అన్నీ రోడ్లపైనే!

అవుకు: రోడ్లపైనే అంట్లు కడగడం, బట్టలు ఉతకడం, మురుగునీటిని పారబోస్తుండడంతో మండల కేంద్రంలోని పలు వీధులు చిత్తడిగా మారుతున్నాయి. పంచాయతీ అధికారులు, సర్పంచ్ హెచ్చరిస్తున్నా గ్రామస్తులు పెడచెవిన పెడుతున్నారు. అవుకులోని రాజావీధి (అవుకు–కోవెలకుంట్ల ప్రధాన రహదారి), మండపం వీధి, పాతపోస్టాఫీసు సందు, ముస్లీం వీధుల్లో నివసిస్తున్న కొందరు చేస్తున్న పనులకు ఆ రోడ్లపై వెళ్లే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలువురు కింద పడి గాయపడిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. పంచాయతీ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


చిత్తడిగా మారిన రాజా వీధి

సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలి


ప్రజాపోరు వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

డోన్ టౌన్: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కిశ్రీకాంత్, కొయిలకొండ నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ప్రజాపోరుకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల్లో పింఛన్ మినహా చేసిందేమీ లేదన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు అంటూ ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటున్నారే తప్పా మహిళల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదని ఆరోపించారు. రైతులకు ఏడాదికి రూ.20వేల చొప్పున రైతు భరోసా, ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికి తల్లి దండనం పేరుతో రూ.15వేలు, 18సంవత్సరాలు దాటిన మహిళలకు నెలకు రూ.1500 హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజలను మభ్యపెట్టే చర్యలు మానుకుని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 14వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. విజయవతం చేయాలని కోరారు. నాయకులు కొండన్న, శివరామ్, రామాంజనేయులు, నాగమద్దయ్య పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేస్తే లైసెన్స్ రద్దు


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు

కోవెలకుంట్ల: మద్యం దుకాణాల నుంచి బెల్ట్‌షాపులకు మద్యం బాటిళ్లు సరఫరా చేస్తే ఆ షాపుల లైసెన్సలు రద్దు చేస్తామని ఉమ్మడి కర్నూలు జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుహాసిని హెచ్చరించారు. శనివారం కోవెలకుంట్ల పట్టణంలోని ఎల్‌ఎం కాంపౌండ్‌లో బెల్ట్‌షాపుపై దాడి చేసి 16 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిర్వాహకురాలు అచ్చమ్మను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేస్తున్నట్లు ఆధారాలు లభిస్తే మొదటిసారి రూ. 5 లక్షల వరకు జరిమానా విధిస్తామన్నారు. అదే మద్యం షాపు నుంచి రెండోసారి పట్టుబడితే ఆ షాపు లైసెన్స్ రద్దు చేస్తామని పేర్కొన్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

డోన్ టౌన్: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎన్‌ఎస్‌యూఐ విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. డోన్‌లోని పలు ప్రైవేట్ విద్యా సంస్థలు సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్నారని.. నియంత్రించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం నాయకులు జగన్, మధు, నవీన్, కార్తీక్, హర్ష, రవి తదితరులు ఉన్నారు.

కార్తీక వన భోజనాలతో ఐకమత్యం


సమావేశంలో మాట్లాడుతున్న దత్తాత్రేయశర్మ

డోన్ టౌన్: కార్తీక మాసంలో శ్రవణా నక్షత్రం రోజు పూజలు, కార్తీక వన భోజన కార్యక్రమం మహోన్నతమైందని కళారత్న, శతవధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ అన్నారు. స్థానిక గాయత్రీ పీఠంలో శనివారం వేదమాత బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వన భోజన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై కార్తీక మాసంలో శ్రవణా నక్షత్రం, వన భోజనాలు, వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఆలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టుకు పూజలు, కార్తీక దామోధర పూజలు చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శంకరశర్మ, ఉపాధ్యక్షుడు కల్లె శేషావలిశర్మ, నాయకులు భాస్కర శర్మ, పుల్లయ్యశర్మ, సుబ్రమణ్యంశర్మ, శ్రీనివాస శర్మ, ఏవీ రావు, న్యాయవాదులు హరిమురళీధర్ రావు, కానాల మహేష్, శేషయనరావు పాల్గొన్నారు.

మట్టి రోడ్డే దిక్కు

- నత్తనడకన సాగుతున్న రహదారి నిర్మాణ పనులు
- వాహనదారులు, స్థానికులకు తప్పని ఇబ్బందులు


కనుమ కింది కొట్టాల గ్రామ రహదారి

బేతంచెర్ల: మండల పరిధిలోని కనుమ కింది కొట్టాల గ్రామానికి ఐదేళ్లగా సరైన రహదారి లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 3.50 కిలోమీటర్లు మట్టి రోడ్డు కావడంతో వర్షం వచ్చినప్పుడల్లా బురదమయంగా మారుతోంది. వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రహదారిని బీటీ రోడ్డుగా మార్చేందుకు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు ప్రారంభించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రహదారి వెంట సిమెంట్ వాల్ నిర్మించి మట్టితో చదును చేశారు. కొన్ని కారణాలతో రహదారి పనులు నిలిచిపోయాయి. ఈ రహదారి మీదుగా గ్రామస్తులతో పాటు బిల్ల స్వర్గం గుహలకు పర్యాటకులు వస్తుంటారు. వర్షం వస్తే బురదమయం.. లేకుంటా దుమ్ము మయంగా మారుతోంది. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని గ్రామస్తులు, పర్యాటకులు కోరుతున్నారు.


ఆగిన పనులతో రోడ్డు దుస్థితి

విద్యుత్ వృథా

కొలిమిగుండ్ల: గ్రామాల్లో ఏర్పాటు చేసిన వీధి లైట్లు పగలు, రాత్రి తేడా లేకుండా 24 గంటల పాటు వెలుగుతున్నాయి. వందలాది యూనిట్ల విద్యుత్ వృథా అవుతోంది. విద్యుత్‌ను ఆదా చేసి పొదుపుగా వాడాలని ఓవైపు ఆ శాఖ అధికారులు చెబుతున్న మాటలు ప్రకటనలకే పరిమితం అవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉండగా 32 గ్రామాలు ఉన్నాయి. చాలా గ్రామాల్లో వీధిలైట్లకు థర్డ్ లైన్, ఆన్‌ఆఫ్ కంట్రోల్ సౌకర్యం లేక నిరంతం వెలుగుతున్నాయి. విద్యుత్ బిల్లుల భారం గ్రామ పంచాయతీలపై పడుతుందోని సర్పంచ్‌లు వాపోతున్నారు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాల్లో పలువురు సర్పంచ్‌లు వీధిలైట్ల వెలుగులపై చర్యలు తీసుకోవాలని చెబుతున్నా ఆచరణకు నోచుకోవడం లేదు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని విద్యుత్ వృథా కాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


పగలే వెలుగుతున్న వీధి లైటు

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎం షరీఫ్

కోవెలకుంట్ల: విద్యావ్యవస్థకు పునాదివంటి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం షరీఫ్ డిమాండ్ చేశారు. శనివారం కడపలోని ఆ సంఘం కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోవెలకుంట్లకు చెందిన ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా కొనసాగుతున్నాయన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లింపు, నామినల్ రోల్స్, ఆపార్‌కార్డుల పనుల్లో ఉపాధ్యాయులపై ఒత్తిడి ఉందన్నారు. ఇలాంటి తరుణంలో ఉపాధ్యాయుల బలవంతపు శిక్షణ వాయిదా వేయాలని, నాన్ రెషిడెన్సియల్ శిక్షణను తర్వాతి కాలంలో ఏర్పాటు చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలు

బేతంచెర్ల: కారును ఢీకొనడంతో స్కూటరిస్టుకు గాయాలైన ఘటన శనివారం మండల పరిధిలోని మద్దిలేటి నరసింహస్వామి ఆలయం వద్ద చోటుచేసుకుంది. బనగానపల్లె మండలం యనకండ్ల గ్రామానికి చెందిన రామాంజి ద్విచక్రవాహనంపై మద్దిలేటి స్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. ఆలయం సమీపంలోని మలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రామాంజికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.

చోరీ నిందితుల అరెస్ట్

- బంగారు, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం


దొంగల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కోవెలకుంట్ల: జల్సాలు, చెడు అలావాట్లకు బానిసై సులభంగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో చోరీలకు పాల్పడిన దొంగలను శనివారం కోవెలకుంట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ హనుమంతునాయక్ విలేరులకు వెల్లడించారు. మండలంలోని కంపమల్ల గ్రామానికి చెందిన శ్రీరాముల విజయభాస్కర్, శ్రీరాముల మౌలాలి కొంతకాలం నుంచి ఇదే గ్రామంలోని నలుగురు రైతుల ఇళ్లతోపాటు దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు గ్రామానికి చెందిన ఆశీర్వాదమ్మ ఇంట్లో చోరీకి పాల్పడి బంగారు ఆభరణాలు, నగదు అపహరించుకెళ్లారు. చేతులకు గ్లౌజ్‌లు, కాళ్లకు సాక్సులు వేసుకుని ఇళ్లకు వేసిన తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడేవారు. ఇటీవల జరిగిన చోరీ ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి చోరీ కేసు మిస్టరీని ఛేదించారు. దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 3.5 తులాల బంగారు ఆభరణాలు, రూ.65 వేలు నగదు, రూ.4 లక్షల విలువ చేసే 36.15 తులాల వెండి పట్టీలు, ఎల్‌ఈడీ టీవీని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దొంగలను కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు. చోరీ కేసుల మిస్టరీని ఛేదించిన ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ నాసర్‌వలి, కానిస్టేబుళ్లు మాలిక్, వెంకటేష్‌నాయక్, మదనగోపాల్, సుధీర్, సుబ్బరాయుడు, లియాజ్‌బేగ్‌ను జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అభినందించినట్లు సీఐ తెలిపారు.